ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	37.6	28.6
కావలి	35	27
ఆత్మకూరు	37	26
ఉదయగిరి	36	26
కందుకూరు	36	27

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

సర్వం సిద్ధం చేసిన అధికారులు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సోమవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. జిల్లావ్యాప్తంగా 38 కేంద్రాలలో 5,422 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 28వ తేదీ వరకు జరిగే పరీక్షలకు నిర్ణీత సమయానికికంటే గంట ముందుగానే కేంద్రాలకు రావాలని అధికారులు తెలిపారు. 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 38 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 280 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవే క్షించనున్నారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్‌తోపాటు కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని డీఈఓ బాలాజీరావు తెలిపారు. అలాగే జిల్లాలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని డీఈఓ తెలిపారు.



● తప్పని ఆర్థిక ఇబ్బందులు

రెండేళ్లుగా ఇబ్బందుల నడుమ టెన్త్ జనరల్, సప్లిమెంటరీ పరీక్షలు, స్పాట్ నిర్వహణను కూడా అప్పులతో పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖకు నేటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో చేతిలో, ఖజానాలో డబ్బులు లేకపోవడంతో సోమవారం నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే కోట్లాది రూపాయలు బకాయిలు ఉండటం, విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించకపోవడం, వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు రావడంతో అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ పరీక్షలతోపాటు వెంటనే జరిగే స్పాట్ నిర్వహణ కష్టతరంగా మారుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈఏపీ సెట్‌కు సర్వం సిద్ధం

● 27వ తేదీ వరకు నిర్వహణ
● జిల్లాలో ఐదు కేంద్రాలు
● 11,540 మంది విద్యార్థులు
● రెండు సెషన్లలో పరీక్షలు

నెల్లూరు(విద్య) : ఇంటర్మీడియేట్ పూర్తయ్యాక ఇంజనీరింగ్, వ్యవసాయ సంబం ధ కోర్సుల్లో చేరడానికి రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈఏపీ సెట్ సోమవారం నుంచి జరగనుంది. ఈ నెల 19, 20వతేదీల్లో బైపీసీ స్ట్రీమ్‌కు, 21వతేదీ నుంచి 27వతేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు పరీక్షలు జరగ నున్నాయి. ప్రతిరోజూ రెండు సెషన్లలో జరిగే ఈ పరీక్షలను కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ నిర్వహిం చేందుకు అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల్లూరు, కావలి పరిధిలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నెల్లూరు నుంచి ఇంజనీరింగ్ విభాగంలో 5,999 మంది, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగాల్లో 2,188 మంది, రెండు విభాగాల్లో 15 మంది కలిపి 8,202 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే కావలి నుంచి ఇంజనీరింగ్ విభాగంలో 2,894 మంది, అగ్రికల్చ ర్-ఫార్మసీ విభాగాల్లో 439 మంది, రెండు విభాగాల్లో 5 మంది కలిపి 3338 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తం మీద జిల్లా నుంచి 11,540 మంది ఈఏపీ సెట్ రాయనున్నారని అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు నిర్దేశిత నియమాలు పాటించాలని అధికారులు సూచించారు.



సమావేశంలో ఐక్యవేదిక నాయకులు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

● 21న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడి
● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

నెల్లూరు (విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణే ధ్యేయంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పోరాటాలకు సిద్ధమవుతోంది. విద్యాశాఖ అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఆదివారం నగరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని బలహీన పరుస్తోందని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సాల్ట్ పథకాన్ని యథాతధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాల విద్యారంగం విచ్ఛిన్నమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో ఆరు రకాల పాఠశాలలు ప్రవేశపెడితే ప్రస్తుతం 9 రకాల పాఠశాలను ప్రతిపాదించి అమలు చేయాలనుకోవడం పాఠశాలలను నిర్వీర్యం చేయడమేనన్నారు. ఇలా అనేక రకాల సమస్యలతో అన్ని సంఘాలు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయం, 23న విద్యాశాఖ కమిషన్ కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా ఈ ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఎ.సురేంద్రరెడ్డి, నవకోటేశ్వరరావు, పిచ్చిబాబు, శేషులు, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, మునీర్, అన్నం శ్రీనివాసులు, ఐక్యవేదిక నాయకులు రాజగోపాలాచారి, పి.అనిల్ కుమార్, చలపతిశర్మ, ఖాజా రహంతుల్లా, నరసింహ మధుసూదనరావు, మస్తాన్, పద్మజ, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు జయంతి సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో కలెక్టర్ ఆనంద్, అజీజ్, కోటంరెడ్డి తదితరులు

పొట్టిశ్రీరాములు పేరిట 22 ఎకరాల్లో మార్కెట్!

● అమరావతిలో కంచువిగ్రహం, స్మృతివనం ఏర్పాటు
● జయంతి సభలో మంత్రి నారాయణ
● అమరజీవికి ఘన నివాళులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజలు జీవించి ఉన్నంత వరకు అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడిగా ఉంటారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అమరజీవి పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన పొట్టిశ్రీరాములు 125వ జయంతి వేడుకలో మంత్రి నారాయణ పాల్గొని ప్రసంగించారు. అమరజీవి జయంతి సందర్భంగా నగరంలోని 9వ డివిజన్‌లో 22 ఎకరాలలో అత్యాధునిక మార్కెట్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కంచు విగ్రహంతోపాటు స్మృతి వనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ తనది కేరళ రాష్ట్రమని, తనకు తెలిసిన మహోన్నత వ్యక్తి పొట్టిశ్రీరాములేనని తెలిపారు. ఆయన ప్రాణత్యాగం చేసే ముందే దేశం వివిధ రకాలుగా మన భాషలపై పరాయి దేశాలు దాడులు చేసి నాశనం చేశాయన్నారు. అమరజీవి ప్రాణత్యాగం వల్ల దేశంలో భాషలు పరిరక్షించబడ్డాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వైశ్య సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ఆర్యవైశ్యులకే చెందిన వాడు కాదు.. అన్ని మతాలకు కులాలకు రాజకీయ పార్టీలకు చెందినవాడని అన్నారు. ఈ సభలో పాల్గొన్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పొల్యూషన్ బోర్డు చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కూటమి నేతలు పి.సురేంద్రరెడ్డి, గునుకుల కిషోర్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, ఆర్యవైశ్య నాయకులు షేగు.షణ్ముఖరావు, కోట గురుబ్రహ్మం, అమరజీవి త్యాగాలను స్మరించుకున్నారు. వేదిక వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి హరికృష్ణ, ఎంపీ ఆంజనేయులు, భవనాపి సురేష్, బ్రహ్మంగుప్తా, దాసా లక్ష్మీనారాయణ, అమరా మోహన్‌రావు ఆర్యవైశ్య నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.



నెల్లూరు : ర్యాలీలో పాల్గొన్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి ఇతర నాయకులు



ఆత్మకూరు : తిరంగా యాత్ర ర్యాలీలో పాల్గొన్న మంత్రి ఆనం, కూటమి నాయకులు

భారత రక్షణ దళాల పరాక్రమాన్ని కీర్తిస్తూ 'ఆపరేషన్ సిందూర్'కు సంఘీభావంగా నెల్లూరు, ఆత్మకూరు, నెల్లూరు రూరల్‌లో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. నెల్లూరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఆత్మకూరులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జెండా ఊపి ర్యాలీలను ప్రారంభించారు. 'మనం సైతం దేశం కోసం' అంటూ వేలాది మంది ప్రజలు జాతీయ పతాకాలు చేతబట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ చేసిన నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఇక నెల్లూరు రూరల్ నియోజవర్గ పరిధిలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మనం సైతం.. దేశం కోసం...

'భారత్ మాతా కీ జై' నినాదాలతో మారుమోగిన నెల్లూరు, ఆత్మకూరు

భారీ త్రివర్ణ పతాకాల ప్రదర్శన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)/ఆత్మకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో కూటమి నాయకులతోపాటు యువకులు, విద్యార్థులు, మాజీ సైనికులు, వివిధ వర్గాల ప్రజలు వెయ్యి అడుగుల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన భారత సైన్యం పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందన్నారు. పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల జవానులు అనిర్వచనీయమైన విజయం సాధించారని కొనియాడారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరులను భారత ప్రజలందరూ ఎప్పటికీ గుర్తుంచుకుంటారని వారికి ఘన నివాళి అర్పిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేత విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనిక ఉద్యోగులు శ్యాంప్రసాద్, కళాధర్, రత్నయ్య, జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ఆత్మకూరులో మున్సిపల్ కార్యాలయం నుంచి సోమశిలరోడ్డు, బీఎస్సార్ సెంటర్, పాతబస్టాండ్ సెంటర్ మీదుగా సత్రం సెంటర్ వరకు తిరంగా ర్యాలీ జరిగింది. కోలాటాలు, మహిళలు ప్రదర్శించిన భారీ జాతీయ పతాకం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం సత్రం సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో 20 మంది విశ్రాంత సైనికులను ఎన్డీఏ కూటమి నేతలు, అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కేవలం మూడు గంటల్లోనే ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైనికుల వీరోచిత పోరాటపటిమ, యావత్ భారత దేశం శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడం భారత సైనికుల ఘనకీర్తికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డీఆర్డీఏ పీడీ నాగరాజుకుమారి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీడీపీ నేత తాళ్లూరు గిరినాయుడు, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవచౌదరి, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ నేతలు తుమ్మల చంద్రారెడ్డి, పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, వెంకటసుబ్బానాయుడు, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్, అక్బర్‌బాష, కూటమి నేతలు, విశ్రాంత సైనికులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● నెల్లూరు రూరల్ : కేవీఆర్ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారత్ అంటే ఏమిటో తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భక్తులకు కొడిముద్దలు పంపిణీ చేస్తున్న చైర్మన్, ఈవో తదితరులు

కామాక్షితాయి ఉత్సవాలకు వేడుకగా ధ్వజారోహణం

కొడిముద్దల కోసం ఎగబడిన భక్తజనం

బుచ్చిరెడ్డిపాళెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగా, కామాక్షితాయి సమేతుడిగా మల్లికార్జున స్వామివారిని ఆలయంలోని ధ్వజస్తంభ మండపంలో కొలువుదీర్చి సకలదేవతల ఆహ్వానపూజ, భేరిపూజ, ధ్వజపటానికి ఆహ్వానపూజ, ఇంద్రాది అష్ట దిక్పాలక ఆహ్వానపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి ధ్వజ స్తంభాలకు నంది, త్రిశూలం, ఢమరుక గురు ఏర్పాటుచేసి దర్భ సూత్ర తాడుతో ధ్వజారోహణం నిర్వహించి కొడిముద్దలను (ధ్వజ ప్రసాదం) నివేదించారు. సంతానం కోసం స్వామి, అమ్మవారి శరణుకోరి వచ్చిన మహిళలకు ఆలయ పండితులు కొడిముద్దలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ చైర్మన్ తీరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ.శ్రీనివాసులురెడ్డి సభ్యులు పాల్గొన్నారు. కాగా, ఉత్సవాల చీఫ్ ఫెస్టివల్ అధికారి, డిప్యూటీ కమిషనర్ విజయరాజు ధ్వజారోహణం కార్యక్రమంలో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

● బ్రహ్మోత్సవాలలో నేడు

కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం తిరుచా ఉత్సవం, రాత్రి శేషవాహనంపై ఆదిదంపతులు విహరించనున్నారు.

● భక్తుల తోపులాట

కొడిముద్దల కోసం ధ్వజస్తంభాల వద్ద, అంతరాలయంలోకి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఎగబడ్డారు. వీరిని అదుపు చేయడంలో ఆలయ సిబ్బంది విఫలమయ్యారు. ఒక పద్ధతి లేకపోవడం వల్లే ఇలా తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. భక్తుల కోసం రెండు క్యూలైన్లు ఉన్నా ముందస్తు చర్యలు లేకపోవడం వల్ల మహిళలను అసంతృప్తిలో పడేస్తుంది.


జిల్లాలో ఇష్టానుసారంగా గోదాములు

ఇరుకు సందుల్లో వాణిజ్య భవనాలు

ఫైర్ ఇంజన్లు రాలేని పరిస్థితులు

నిబంధనలు పాటించని నిర్మాణాలు ఎన్నో!

హైదరాబాద్‌లో అగ్నిప్రమాదంతో ఉలిక్కిపడ్డ జిల్లా



నెల్లూరు నగరం



మన భవంతుల్లో భద్రత ఎంత?

హైదరాబాద్‌లో చార్మినార్ సమీపాన ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో 17 మంది దుర్మరణం చెందిన ఘటన జిల్లావాసులను కలవరపాటుకు గురిచేసింది. గతంలో జిల్లాలో జరిగిన పలు అగ్ని ప్రమాదాలను గుర్తు చేసింది. చిన్నబజారు ప్రాంతంలో ఇంటిపై తారాజువ్వ పడి ఇల్లు దగ్ధమైన ఘటన, బోడిగాడితోట వద్ద కెమికల్ గోదాములో జరిగిన అగ్ని ప్రమాదం, అయ్యప్పగుడి సమీపంలో జరిగిన అగ్నిప్రమాదం, రెండు రోజుల ముందు కోవూరులో జరిగిన అగ్నిప్రమాదం.... ఇలా జిల్లాలో జరిగిన వరుస అగ్ని ప్రమాదాలు ముందస్తు జాగ్రత్తలపై ప్రజలను హెచ్చరిస్తున్నాయి.

నెల్లూరు(క్రైం), మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెల్లూరు నగరంతోపాటు పలు పట్టణాల్లో షాపింగ్ మాల్స్, ఫర్నీచర్ మాల్స్, పెద్దపెద్ద వైద్యశాలలు, కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు, పరిశ్రమలు, గోదాములు వందల సంఖ్యలో ఉన్నాయి. అయితే వాటిలో కొన్నింటికి మాత్రమే అగ్నిమాపక శాఖ అనుమతులు ఉండి అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకొని ఉన్నారు. మిగిలినవన్నీ నిబంధనలకు విరుద్ధమే!. అనధికార భవంతులు, నివాసాల మధ్య ఉంటున్న గోదాముల సంఖ్య అయితే వేలల్లోనే ఉంటుంది. ఇలాంటి వాటిలో ఊహించని సంఘటనలు, ప్రమాదాలు సంభవిస్తే ప్రాణ, ఆస్తి నష్టం భారీగా ఉంటుంది.



కావలి

ఫైర్‌ఇంజన్ తిరిగే చాన్స్ లేదు

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇళ్ల దుకాణాలు, షాపింగ్ మాల్స్ వైద్యశాలలు, అపార్ట్‌మెంట్లను ఇరుకు సందుల్లో, నిబంధనలు పాటించకుండా నిర్మించి ఉన్నారు. కనీసం అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఇంజన్లు కూడా ఆ ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి. ప్రధానంగా నెల్లూరు నగరంలో చిన్నబజారు, పెద్దబజారు, ట్రంకురోడ్డు ఇలా ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లోనూ ఇరుకు సందుల్లో భవనాలు ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో మంటలు ఆర్పలేక ఆస్తి, ప్రాణ నష్టం అధికంగా జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సైతం మంటలను ఆర్పేందుకు అవకాశం లేకపోవడం వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పెద్ద ప్రమాదాలు జరిగి, ప్రాణ నష్టం వాటిల్లకముందే అధికారులు కళ్లు తెరిచి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్ పరీక్ష

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ఐఐటీల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలోని కోవూరు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, పొట్టేపాళెం అయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా 1500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వర కు రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్దకు గంటన్నర ముందుగానే హాజరైన విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు.

కండలేరు నీటిమట్టం 43.420 టీఎంసీలు

రాపూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కండలేరు నీటిమట్టం పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 43.420 టీఎంసీల నీరు నిల్వ ఉందని కండలేరు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా అవుట్‌ఫ్లో 1900 క్యూసెక్కులు ఉందని తెలిపారు.



మండల కేంద్రం అనంతసాగరం లోని లేఅవుట్ వద్ద ఆది వారం సాయంత్రం సూర్యా స్తమయం నీలి కాంతులతో సుందరంగా ఆవిష్కృత మైంది. రంగుదిద్దినట్లు నీలి కాంతులతో ఆకాశం చూప రులను ఆకట్టుకొంది.
ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

సుందర సూర్యాస్తమయం

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆది వారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యుడు గణేశం దయాకర్‌రెడ్డి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పిల్లలకు పొణక కనకమ్మ జీవిత విశేషాలు గురించి వివరించారు. ఇందుకూరుపేట హైస్కూల్ ఉపాధ్యాయుడు పీవీ శేషయ్య, ఆశ్రమం మేనేజర్ మనోజ్, పాల్గొన్నారు.

అంధకారంలో గండిపాళెం జలాశయం


ఉదయగిరి రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల వరప్రసాదినిగా చెప్పుకొనే గండిపాళెం జలాశయ నిర్వహణ లోపం గ్రామస్థులకు శాపంగా మారింది. ఏళ్ల తరబడి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందక అన్నదాతలు, ప్రజలు అవస్థలు పడుతు న్నారు. అంతేగాక సమీప ప్రాంతాల ప్రజలు కుటుంబ సమేతంగా ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరేందుకు అక్కడికి చేరుకుంటారు. అలాగే ప్రాంగణంలోని ఆలయాలకు సైతం భక్తులు వస్తుంటారు. వసతుల సంగతి అటుంచితే కనీసం రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో చిమ్మచీకటిలో జలాశయ ప్రాంగణానికి వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జలాశయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నాలుగు రోజుల క్రితం ఓ వ్యక్తి నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైలు దిగి బస్టాండ్‌కు నడుచుకుంటూ వస్తున్నాడు. ఆ మార్గంలో ఓ బ్యాచ్ ఆ వ్యక్తిని అడ్డగించింది. రెండు బైకులలో వచ్చిన ఆకతా యిలు కత్తులతో బెదిరించారు. చేతిలో ఉన్న డబ్బులు, బంగారం ఇవ్వాలని బెదిరించారు. ఆ వ్యక్తి దగ్గర రూ.వెయ్యి మాత్రమే ఉండ టంతో లాక్కొని పరారయ్యారు.

చెన్నైకు చెందిన మరో వ్యక్తి వారం రోజుల క్రితం ఓ రైలులో హైదరాబాద్ వైపు వెళుతూ అనారోగ్యంతో నెల్లూ రులో దిగారు. తిరిగి చెన్నైకు వెళ్లేందుకు నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ బయటకు వచ్చి చెన్నై బస్సు కోసం ఎదురుచూ స్తున్నారు. ఇంతలో ఓ ఆకతాయిల బ్యాచ్ వచ్చి సదరు వ్యక్తిని బెదిరించారు. కత్తులు చూపిస్తూ ఆ వ్యక్తి దగ్గర డబ్బులు లాక్కొనేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో చెన్నైకు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి.

రెండు రోజుల క్రితం గాంధీబొమ్మ వద్ద పోలీసులు అర్ధ రాత్రి సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అటుగా స్కూటీలో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వాహనాన్ని వెనక్కు తిప్పారు. ఇంతలో పోలీసులకు అను మానం వచ్చి వారిని వెంబడించగా ఒక వ్యక్తి పరార య్యాడు. పట్టుబడిన వ్యక్తి స్కూటీని తనిఖీ చేయగా కత్తి బయటపడింది. విచారణ చేయగా సదరు ఇద్దరు వ్యక్తులు రాత్రి వేళల్లో రోడ్డుపై వెళుతున్న వారిని బెదిరించి డబ్బులు లాక్కొంటున్నట్లు తేలింది.



ఒంటరిగా వస్తే దోచేస్తారు!

- నెల్లూరు నగరంలో ఆకతాయిల అలజడి
- కత్తులతో బెదిరించి డబ్బులు, నగలు దోపిడీ
- ఇటీవల వరుసగా బయటపడుతున్న ఘటనలు
- బైకుల్లో కత్తులు పెట్టుకొని తిరుగుతున్న గంజాయి బ్యాచ్

ఇవే కాదు.. ఇటువంటి సంఘటనలు ఇటీవల నెల్లూరు నగ రంలో అనేకం జరుగుతున్నాయి. ప్రశాంతతకు మారుపే రైన సింహపురి నగరం హింసపురి నగరంగా మారుతోంది. రౌడీషీ టర్ల ప్రభావం ఎక్కువవడం, వీరి ప్రోద్బలంతో ఆకతాయిలు రెచ్చి పోతుండడంతో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. అడపాద డపా పోలీసులు తనిఖీలు చేపడుతూ కొందరు రౌడీషటర్లు, ఆకతా యిలను పట్టుకుంటున్నా పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదు. గతంలో నెల్లూరు నగరంలో ఏ వేళలో అయినా ప్రశాంతంగా ఇంటికి వెళ్లే వారు. కానీ ఇప్పుడు అర్ధరాత్రి వేళ రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది.

అసాంఘిక కార్యకలాపాలాకు బానిసలైన కొందరు యువత పెడ దారి పడుతున్నారు. జల్సాల కోసం ఈజీ మనీకై అడ్డదారులు తొక్కు తున్నారు. కత్తులను వెంట పెట్టుకొని తిరుగుతున్న కొందరు ఆకతా యిలు రాత్రి వేళల్లో బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగుతూ సామాన్యు లను దోచుకుంటున్నారు. పాపం ఎవరైనా ఎదురుతిరిగితే వారిని ఇష్టమొచ్చినట్లు కొడుతున్నారు. ఇటువంటి బ్యాచ్‌లు నగరంలో ఇటీ వల కాలంలో విపరీతమయ్యాయి. ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అని లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఈ అనాగరిక సంస్కృతి కొనసాగుతోంది.

రౌడీషీటర్ల అనుచరులుగా చలామణి

నగరంలో రౌడీషీటర్లకు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో వారు చెలరేగిపోతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా హత్యలకు తెగబడుతున్నారు. గడిచిన కొన్ని నెలల్లో నగరంలో జరిగిన హత్యలను పరిశీలిస్తేనే ఈ విషయం స్పష్టమవుతుంది. ఏకంగా సుపారీ హత్యలు చేసే స్థాయికి రౌడీషీ టర్లు తెగబడుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఒంగోలులో జరిగిన టీడీపీ నేత హత్య కేసులో ప్రధాన ముద్దా యిలు నెల్లూరు నగరానికి చెందిన వారే కావడం గమనార్హం. ఈ రౌడీషీటర్లు జైళ్లకు వెళ్లి వచ్చినా వారిలో మార్పు ఉండడం లేదు. కొందరు యువతను తమ బానిసలుగా మార్చుకొని వారిని కూడా రౌడీయిజంలోకి దించుతున్నారు. ఇలా రౌడీషీటర్ల అనుచరులుగా కొనసాగుతున్న వ్యక్తులే తొలుత కత్తులతో బెదిరింపులకు దిగు తున్నట్లు పోలీసుల విచారణలో తేలుతోంది. ఆ తర్వాత స్టేజీ మారి హత్యలు చేసే స్థాయికి ఎదుగుతున్నట్లు పరిస్థితులు తెలియజేస్తున్నాయి. అయితే రౌడీషీటర్లు, వారి అనుచరు లుగా చలామణి అవుతున్న ఆకతాయిలపై పోలీసుల నిఘా సరిగ్గా ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వరు సగా హత్యలు, దోపిడీలు జరగడానికి కూడా ఇదే ప్రధాన కార ణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో గంజాయి వినియోగం విపరీతమైంది. అయితే దీనిని నిలువరించడంలో పోలీసు శాఖ విఫలమవుతోంది. ఇటువంటి జల్సాలకు బాని సలైన వ్యక్తులే డబ్బుల కోసం రాత్రి వేళల్లో ఒంటరిగా వెళు తున్న వారిని దోపిడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రజలను భయభ్రాం తులకు గురి చేయడమే కాకుండా పక్క ప్రాంతాల వారికి కూడా నెల్లూరుపై అభద్రతా భావం ఏర్పడుతోంది. కొన్ని రోజుల పాటు పోలీసులు ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పగలు, రాత్రి తేడా లేకుండా సరైన పోలీసింగ్‌ను నిర్వహిస్తేనే పరిస్థితులు అదు పులోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టంపై సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం) : టౌనుహాలులో ఆదివారం సమాలోచన సంస్థ ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం -2025పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా రాజకీయ విశ్లేషకుడు రాకా సుధాకర్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమాలోచన విభాగ్ సంయోజక్ ఏబీ రవికుమార్, అశోక్‌రావు, ఏవీ రెడ్డి, వీఎస్‌యూ చెంచురెడ్డి ప్రసంగించారు.

వ్యవసాయ శాఖలో సంస్కరణలు

- ఆర్ఎస్‌కే సిబ్బందికి పనిభారం తగ్గించే యోచన
- జిల్లాకు 344 రైతు సేవా కేంద్రాలు?
- ఆర్ఎస్‌కే పరిధిలో 950 నుంచి 1200 ఎకరాలు
- హేతుబద్ధీకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తి

నెల్లూరు (వ్యవసాయం), మే 18 (ఆంధ్రజ్యోతి) : ఒకరికి పని ఎక్కువ... ఒకరికి పని తక్కువ కాకుండా అందరికీ సమాన పని కల్పించడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేం దుకు చర్యలు చేపట్టింది రాష్ట్ర ప్రభుత్వం. అందులో భాగంగానే వ్యవసాయశాఖలో పలు సంస్క రణలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన రైతు సేవా కేంద్రాలను (ఆర్ఎస్‌కే) హేతుబద్ధీకరణ చేపట్టింది.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 665 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. జనాభా ప్రాతిపది కన ఏర్పాటు చేసిన సచివాలయాల క్లస్టర్లను పరిగణలోకి తీసుకుని గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరీ కల్చర్ సహాయకులను హేతుబద్ధీకరణ చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదే శాలు వచ్చాయి. అర్బన్ ప్రాంతాలు కాకుండా 336 క్లస్టర్లుగా ఉమ్మడి జిల్లాను విభజించి అందుబాటులో ఉన్న 487 ఆర్ఎస్‌కేల సిబ్బందిని పరిగణలోకి తీసుకుని హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేయాలనేది సారాంశం. అయితే ఈ లెక్కన ఆర్ఎస్‌కేల సిబ్బందిని హేతుబద్ధీకరించడం సాధ్యం కాదని వ్యవసాయశాఖ చెప్పడంతో జిల్లావ్యాప్తంగా గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ఈ-పంటలో నమోదైన సాగుభూమి ప్రాతిపదికన హేతుబద్ధీకరణ చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.

950 నుంచి 1200 ఎకరాలు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అర్బన్ ప్రాంతాలు కాకుండా 665 ఆర్ఎస్ కేలు ఉన్నప్పటికి 487 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. ఎంపీఈ వోలు, ఏఈవోలో అదనం. ఈ లెక్కన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 487 రైతు సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి అక్కడి సిబ్బందిని హేతుబద్ధీకరణ చేపట్టారు. జిల్లావ్యాప్తంగా దాదాపుగా 4.77లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నట్లు ఈ-పంట నమోదులో తేలింది. ఈ లెక్కన 950 ఎక రాల నుంచి 1200 ఎకరాల పరిధిని ఆర్ఎస్‌కే సిబ్బందికి కేటాయింపులు చేశారు. అర్బన్ ప్రాంతాల్లో ఎంపీఈవోలు, ఏఈవోలు ఆర్ఎస్‌కే బాధ్యతలు తీసుకుం టారు. ఇంకా అవసరమైతే వీరి సేవలను కూడా రూరల్ ప్రాంతాల్లోని ఆర్ఎస్‌కేలకు వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 418 మంది గ్రామ వ్యవసాయ సహాయకులు, 53 మంది గ్రామీణ ఉద్యాన శాఖ సహాయకులు ఉన్నారు. మరో 16 మంది పలు కోర్టు కేసుల్లో హోల్డ్‌లో ఉంచారు.



కొడవలూరు మండలం కమ్మపాళెంలోని రైతు సేవా కేంద్రం

జిల్లా పరిధిలోకి 344 ఆర్ఎస్‌కేలు

హేతుబద్ధీకరణ అనంతరం మొత్తం 487 ఆర్ఎస్‌కేలలో జిల్లాకు 344 రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఇందులో 304 గ్రామ వ్యవసాయ సహాకులు, 40 మంది ఉద్యానశాఖ సహాయ కులు సేవలందించనున్నారు. దాదాపు 143 ఆర్ఎస్‌కేలు తిరుపతి జిల్లా పరిధిలోకి వెళ్ల నున్నాయి. ఈ క్రమబద్ధీకరణతో ఎక్కడ ఆర్ ఎస్‌కేలు ఉంటాయి.. ఎక్కడ తొలగించను న్నారన్న విషయాలు ఎంతో గోప్యంగా ఉంచారు. ఆయా ఆర్ఎస్‌కేలలో పనిచేస్తున్న సిబ్బందిని ఎక్కడెక్కడ విధులు కేటాయించే విషయాన్ని కూడా బయటకు రానివ్వకుండా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకుంటు న్నారు. ఆర్ఎస్‌కేల హేతుబద్ధీకరణ నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ప్రభుత్వం ఆమో దిస్తూ ఆదేశాలు జారీ చేసిన తరువాతే హేతుబద్ధీ కరణకు అనుగుణంగా ఆర్ఎస్‌ఖేల సేవలు అందు బాటులోకి రానున్నాయని జిల్లా వ్యవసాయాధికా రులు చెబుతున్నారు.



హనుమాన్ జయంతి ర్యాలీలో పాల్గొన్న హనుమాన్ భక్తులు, ప్రజలు

జై శ్రీరాం.. జై హనుమాన్!

- కావలిలో ఉత్సాహంగా శోభాయాత్ర

కావలి, మే 18 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం కావలిలో హనుమా న్ శోభాయాత్ర వైభవంగా సాగింది. స్థానిక వెంగళరావునగర్ లోని మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన యాత్ర పట్టణ పురవీధుల నుంచి ముసునూరు ఆంజనేయస్వామి గుడి వరకు సాగింది. కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని బైక్ నడుపుతూ ర్యాలీని ఉత్సాహపరిచారు. విశ్వహిందూపరిషత్, భజరంగదళ్, బీజేపీ దాని అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో జరి గిన హనుమాన్ శోభయాత్రలో వేలాదిగా ప్రజలు పాల్గొ న్నారు. జైహనుమాన్, జైశ్రీరామ్ నినాదాలతో పట్టణం మారు మోగింది. అడుగడుగునా కాషాయ జెండాలతో కావలి కళకళ లాడింది. చివరిగా మద్దూరుపాడు ఆంజనేయస్వామి ఆల యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, హిందూసంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు టీడీపీ

- మినీమహానాడు ప్రతిపాదనలన్నీ నెరవేరుస్తాం
- రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (వైద్యం), మే 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని రాష్ట్ర పుర పాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. స్థానిక గోమతినగర్‌లో ఆదివారం జరిగిన మినీ మహానా డులో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన మంత్రి మాట్లాడుతూ ఈ మినీ మహానాడులో తీసు కున్న ప్రతిపాదనలన్నీ నెరవేరుస్తామన్నారు. నెల్లూ రు సిటీలో 5వేల మందికి ఇంటిపట్టాల సమస్య పరి ష్కరించినట్లు చెప్పారు. రూ.15 కోట్లతో వీఆర్ హైస్కూల్‌ను దేశంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చి దిద్దుతామ న్నారు. రూ.175 కోట్లతో జాఫర్ సాహెబ్, సర్వేపల్లి కాలువల్లో పూడికతీత పనులు చేపడతామ న్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే నిర్ణ యాలతో మంత్రి నారాయణ జనం గుండెల్లో నిలిచిపోయార న్నారు. మంత్రి కుమార్తె పొంగూరు షరిణి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు ప్రసంగిం చారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నేతలు విజేతారెడ్డి, తాళ్లపాక అనూ రాధ, ధర్మవరం సుబ్బారావు, కార్పొరే టర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి నారాయణ, పక్కన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి తదితరులు

ప్రతిపాదనలు ఇవీ..

- నెల్లూరులో అండర్‌గ్రౌండ్ పనులు త్వరలో పూర్తి చేయాలి.
- ప్రతి ఇంటికి నీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని, సంగం బ్యారేజీ నీటిని అందించాలని తీర్మానించారు.
- నగరంలో మిగిలిన పార్కులను అభివృద్ధి చేసి, పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి.
- పెద్ద పంటకాలువను ఆధునికీకరించాలి.
- భగత్‌సింగ్ కాలనీ వాసులతోపాటు మిగిలినవా రికీ శాశ్వత ఇళ్ల పట్టాలు ఇప్పించాలి.



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత
- నెల్లూరులో కొవ్వొత్తులతో ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) : హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై సమాజంలో వివక్ష లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిమీద ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. హెచ్ఐవీతో మరణించిన వారి జ్ఞాపకార్థం వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం సాయంత్రం నెల్లూరులో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి బీఈడీ కార్యాలయం వరకు ఈ ప్రద ర్శన సాగింది. సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హెచ్ఐవీపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలి మాట్లాడు తూ ప్రతి పీహెచ్‌సీలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తా రని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు మందులు కూడా ఇస్తారని వెల్లడిం చారు. ఈ కార్యక్రమం లో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణు గోపాల్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌లో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్టీఆర్ నగర్ రింగ్‌రోడ్డు ప్రాంతానికి చెందిన డీ వలియా(29)కు తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతిచెందారు. దీంతో ఆయన నానమ్మ ఆంథోనమ్మ వద్ద ఉంటూ పెయింట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన వలియా సంపాదించిన నగదు సరిపోక మద్యం సేవించేందుకు తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు ఇంటిని అమ్మి నగదు ఇవ్వాలని నానమ్మపై ఒత్తిడి తీసుకువచ్చాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో మనస్తాపా నికి గురై ఆదివారం పురుగుల మందు తాగాడు. నానమ్మ, స్థానికులు హుటాహుటిన వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే యువకుడు మృతిచెందాడని నిర్ధారించారు. దీనిపై బాలాజీనగర్ పోలీసుల కు ఫిర్యాదు అందగా ఎస్ఐ విజయ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కొండాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బి య్యాన్ని పోలీ సులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. మండలంలోని మర్రిగుంట నుంచి శనివారం అర్ధరాత్రి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ వాహనాన్ని గ్రామస్థులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని పరిశీలిం చగా అందులో 50 కిలోల బియ్యం బస్తాలు 70 (35 క్వింటాళ్లు) ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. జలదంకికి చెందిన వాహన డ్రైవరు కే.బ్రహ్మేశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	135
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	268

కోడిగుడ్ల ధర (100) : 535

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8982
వెండి కిలో ధర	రూ. 98,200
వెండి ఒక గ్రాము	రూ.101.20

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (హరనాథపురం), మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం సాయంత్రం 5గంటలకు టౌను హాలులో జరుగుతుందని తెలి పారు. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చిస్తామని, విశ్రాంత ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు.

న్యూస్ బాక్స్

నలుగురు కొత్త ఆర్‌ఐలు

● ఇద్దరికి ఉద్వాసన?

నెల్లూరు సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలోకి కొత్తగా నలుగురు ఆర్‌ఐలు రానున్నారు. ఈ మేరకు కార్యాలయంలో దస్త్రం సిద్ధమైనట్లు తెలిసింది. సిటీప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు, రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న మరో ఇద్దరికి ఆర్‌ఐ బాధ్యతలు అప్పగించేందుకు కమిషనర్ నందన్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు నోట్ ఫైల్ కూడా సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, ఇటీవల షోకాజు నోటీసులు అందుకున్న ఇద్దరు ఆర్‌ఐలకు ఉద్వాసన పలకనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఫైల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. కార్పొరేషన్‌లోని ఒక్కో విభాగాన్ని ప్రక్షాళన చేసుకుంటూ వస్తున్న కమిషనర్ నందన్ ఉన్నతస్థాయి నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు సమూలంగా మార్పు చేస్తున్నారు.

కిమ్స్‌లో ఐబీడీకి ఉచిత సేవలు

నెల్లూరు (వైద్యం), మే 18ట (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో ఐబీడీ(ఇన్‌ఫ్లమేటరీ బౌల్ డీసీజ్)కి సోమవారం నుంచి జూన్ 18వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి ఈడీ గిరి నాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో ఈ వ్యాధికి ఉచిత శిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అతిగా విరేచనాలు కావడం, మలంలో రక్తం పడటం, కడుపు నొప్పి రావటం, బరువు తగ్గటం, కీళ్ల నొప్పులు తదితర కారణాలు ఐబీడీ లక్షణాలన్నారు. గాస్ట్రోఎంటరాలజిస్టులు డాక్టర్ జానకిరామ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఈ వ్యాధిగ్రస్తులకు 50 శాతం రాయితీతో వైద్య చికిత్సలు అందిస్తారని తెలిపారు.

నేటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) మే 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో సోమవారం నుంచి ఈ నెల 22వతేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన 48 గంటల నిరాటంక హనుమాన్‌చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో సాగుతోంది. విజయవాడ హనుమాన్ దీక్షా పీఠం కళాకారులు పారాయణం చేస్తున్నారు. కాగా, నగరంలోని సుజాతమ్మకాలనీలో ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలోని కార్యసిద్ధి ఆంజనేయస్వామికి హనుమజ్జయంతి ఉత్సవాలు ఈనెల 22న జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

ఘనంగా గంగమ్మకు పొంగళ్లు

మనుబోలు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువుకట్ట వద్దనున్న గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్ళు సమర్పించారు. ముందుగా అమ్మవారికి క్షీర, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు అర్చకులు నిర్వహించారు. పులిమి చిరంజీవి, పావని, శివారెడ్డి రామిరెడ్డి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ కొలుపు

రాపూరు : పంచాయతీ పరిధిలోని నవాబుపేటలో గంగమ్మ తల్లి కొలుపు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆలయ పూజారి అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు చెముడుగుంటలో మినీ మహానాడు

వెంకటాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న శ్రీడ్స్ కల్యాణ మండపంలో సోమవారం మినీ మహానాడు నిర్వ హిస్తున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం 3గంటలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సిద్ధాంతాలు, విజయయాత్ర, భవిష్యత్తు దిశపై చర్చలు, నాయకత్వ మార్గదర్శకాలు వంటి అంశాలపై కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

వెంకటాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవరుతుందని ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కల్నల్ డి కరంచంద్ అన్నారు. మండలంలోని చవటపాలెం పంచాయతీ సరస్వతీనగర్ వద్ద అక్షర విద్యాలయంలో ఆదివారం ఎన్‌సీసీ శిక్షణ శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులకు ఖోఖో, మ్యూజికల్ చైర్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, ఎన్‌సీసీ క్యాంప్ అధికారి బాల్యబ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాణేలు, నోట్ల ప్రదర్శన

నెల్లూరు (సాంస్కృతికం), మే 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన నాణేలు, నోట్ల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు చలామణి అయిన వివిధ నాణేలు, కరెన్సీ నోట్లను ప్రదర్శించారు. ప్రభుత్వం విడుదల చేసే కమోడి టిప్ కాయిన్స్, అమెరికాలోని 40 రాష్ట్రాల్లో వినియోగించే క్వార్టర్ కాయిన్స్‌ను పిల్లలు ఆసక్తిగా తిలకించారు. వీటితోపాటు బంగారు, వెండి, ప్లాస్టిక్ కాయిన్లు, ఇతర దేశాల నాణేలు, కరెన్సీ నోట్లు, బర్త్‌డే నోట్లను ప్రదర్శించారు. వాటి గురించి సైన్స్ టీచర్ ఎం సతీష్‌కుమార్ వివరించారు. సుబ్బారావు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి కుమార్ రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, సిబ్బంది జితేంద్ర పర్యవేక్షించారు.



ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న బాలబాలికలు

చెత్త కంప్యాక్టర్ల ప్రారంభం

నెల్లూరు సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చెత్తను డంపింగ్ యార్డులకు తరలించే కంప్యాక్టర్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం ప్రారంభించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.7 కోట్లతో 6 కంప్యాక్టర్లను కొనుగోలు చేసిన ప్రభుత్వం వాటిని కార్పొరేష న్‌కు అందచేసింది. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద వీటిని మంత్రి ప్రారంభించారు. ఈ కంప్యాక్టర్లతో చెత్త తరలింపు ప్రక్రియ సులభతరమవుతుందని ఆయన వెల్లడించారు. పారిశుధ్య రంగంలో యంత్ర పాలనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, జనసేన నేత మల్లికార్జున్ యాదవ్ పాల్గొన్నారు.



కంప్యాక్టర్లను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

వీఆర్ హైస్కూల్ ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి : శరణి

నెల్లూరు(విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ హైస్కూల్‌ను ఉన్నత ప్రమాణాలతో ఆధునీకరించి పేద విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా పనులపై దృష్టిసారించామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె శరణి అన్నారు. ఆ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం మంత్రితో కలిసి ఆమె పరిశీలించారు. ఆహ్లాదభరితమైన వాతావరణం ఉంటేనే విద్యలో రాణిస్తారని, దీనికోసంగా పాఠశాల ఆవరణలో ఇండోర్ ప్లే ఎక్విప్‌మెంట్, ఇతర ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పనులన్నీ పూర్తి చేసి జూన్ 12న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారన్నారు. పీ-4 విధానంలో తాను కూడా కొందరు విద్యార్థులను దత్తత తీసుకుని వారి ఉన్నతికి పాటుపడతానని తెలిపారు.


మహనీయుడు మన అమరజీవి

నెల్లూరు (వైద్యం), మే 18ట (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ప్రస్తుతించారు. ఆదివారం పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ వంటి ఆశయాలకు జీవితాంతం కట్టుబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, షేక్ ఫయాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, మోహన్‌రెడ్డి, పప్పర్తి గణేష్‌బాబు, హుస్సేన్‌బాషా, సయ్యద్ నసీమా, నాగిరెడ్డి రాజేష్‌రెడ్డి, ఫజులుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు

ప్రముఖుల ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అమరణ దీక్ష చేసిన పొట్టిశ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆదివారం పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి నగర కమిషనర్ వై నందన్, ఆర్యవైశ్య నాయకులు పేగు షణ్ముఖరావు, కోట గురుబ్రహ్మం, బ్రహ్మంగుప్తా, ఇతర నేతలు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జనసేన నాయకుడు నూనె మల్లికార్జున్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న చేవూరు

రక్తపోటుపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), మే 18 (ఆంధ్రజ్యోతి) : రక్తపోటు విషయంలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయంలో రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చెక్ బీపీ - స్టాప్ స్ట్రోక్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రచారం శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బీపీని నిర్లక్ష్యం చేస్తే అది తీవ్ర అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ వైకల్యానికి, మరణాలకు ప్రధాన కారణం రక్తపోటని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జనార్దన్ రాజు, కోశాధికారి సురేష్ కుమార్‌జైన్, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు, నెల్లూరు న్యూరో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రమణమూర్తి, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మే 18,(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కంపెనీల నుంచి వచ్చే ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన పరిశీలించి, కొందరు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. అనంతరం మాట్లాడుతూ అమరావతిలోని ప్రముఖ నిర్మాణ సంస్థల్లో పనిచేసేందుకు నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పట్టభద్రులు, పీజీ చేసి యువతకు మెండుగా అవకాశాలున్నాయని తెలిపారు. అనంతరం పొట్టిశ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ సెంటర్లోని అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత వీఆర్సీ మైదానంలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు.



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న కమిషనర్

ఉత్సాహంగా ఆలిండియా చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడిలోని ఫన్‌పార్కు కన్వెన్షన్ హాలులో ఆదివారం ఆలిండియా చెస్ పోటీలు జరిగాయి. పెద్ద సంఖ్యలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫన్‌పార్క్ సౌజన్యంతో నిర్వహించిన ఈ టోర్నీని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ సురేంద్రరెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. జిల్లాలో మూడు దశాబ్దాలుగా చెస్ పోటీలు నిర్వహిస్తూ ఎంతో మంది క్రీడాకారులను తయారు చేయడం అభినందనీయమన్నారు. ఇదే ఉత్సాహంతో మున్ముందు మరిన్ని విజయాలు సాధించి సింహపురి ప్రతిష్ఠను పెంచాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన పోటీల్లో అంతర్జాతీయ, ఫిడే రేటింగ్ క్రీడాకారులు, టైటిల్ ప్లేయర్స్ కలిపి మొత్తం 250 మంది పోటీపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై సుమన్, ఫన్‌పార్క్ ఎండీ పొత్తూరు సాయి, ఈడీ సంయుక్త, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం గోపీనాథ్, కోచ్‌లు డాక్టర్ మధురెడ్డి, సుమంత్, ఆర్బిటర్స్ హుస్సేన్, రామ్‌లక్ష్మణ్, జేసీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సురేంద్రరెడ్డి

ఘనంగా మ్యూజియం డే!

నెల్లూరు (సాంస్కృతికం), మే 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీ నగర్‌లో ఉన్న జిల్లా మ్యూజియంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు ఆదివారం జరిగాయి. ప్రజలు, విద్యార్థులు, చిన్నారులు, మ్యూజియంను సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు.

దాడి చేసిన వ్యక్తుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), మే 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసిన నిందితులు ఇద్దరిని నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఆదివారం సీఐ వేణుగోపాలరెడ్డి విలేకర్లకు వెల్లడించారు. చెన్నై పల్లవరానికి చెందిన హనుమంత్ ఈ నెల 16వ తేదీ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరబాద్ వెళుతుండగా అనారోగ్యానికి గురవడంతో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో దిగేశారు. తిరిగి చెన్నై వెళ్లేందుకు ఆత్మకూరు బస్టాండు వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి అకారణంగా హనుమంత్‌తో గొడవపడి బండరాళ్ళతో దాడి చేశారు. గమనించిన స్థానికులు నిందితులను పట్టుకునేలోపు వారు పరార య్యారు. బాధితుడిని 108 వాహనంలో జీజీహెచ్‌కు, అక్కడి నుంచి నారాయణ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై నవాబుపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు అందడంతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులు వేదాయపాళెం జర్నలిస్టు కాలనీకి చెందిన బట్టా గగన్ కుమార్, చంద్రమౌళి నగర్‌కు చెందిన ముమ్మడి అన్వేష్‌గా గుర్తించారు. వారిని ఆదివారం సాయంత్రం జీజీహెచ్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థకు తూట్లు: ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వ్యవసాయ శాఖను భ్రష్టు పట్టించడమే కాకుండా ఆర్థిక వ్యవస్థకు తూట్లు పొడిచారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని వరిగొండ గ్రామంలో ఆదివారం స్థానిక నేత కోడూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ నిర్వహించిన యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈసందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రూ.3.5 కోట్లతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో వరిగొండ, పేడూరు గ్రామాలకు రెండు డ్రోన్‌లు అందినట్లు తెలిపారు. రైతులు గ్రూపుగా ఏర్పడితే 80శాతం సబ్సిడీతో అవసరమైన వారికి డ్రోన్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, ఏడీఏ రాజ్‌కుమార్, టీడీపీ నేతలు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, జాఫర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ కొణతం రఘుబాబు, తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

● పొదలకూరు : మండలంలోని మరుపూరు గ్రామంలో ఆదివారం రాత్రి పలు అభివృద్ధి పనులు ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రారంభించారు. నిలిచిపోయిన దేగపూడి - బడేపల్లి కాలువ సోమశిల దక్షిణ కాలువ ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బొమ్మి సురేంద్ర, వెంకటరత్నంనాయుడు, పెంచలభాస్కర్‌రెడ్డి, కండే మస్తానయ్య, అరుణమ్మ, సుగుణమ్మ, శ్రీనివాసులుగౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.లక్ష ఆర్థికసాయం

కోవూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంగం సమీపంలోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో ఈత కెళ్లి మృతి చెందిన కోవూరుకు చెందిన చిన్నారులు చందు, నందు కుటుంబానికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.లక్ష ఆర్థికసహాయం చేశారు. ఈ నగదును ఆదివారం పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి ద్వారా స్టౌబీడీ కాలనీలో నివాసముంటున్న చందు, నందు తల్లి శేషమ్మకు అందజేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బాధిత కుటుంబానికి అండగా ఉంటారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.



శ్మశానవాటికలో ముళ్ల చెట్ల తొలగింపు

విడవలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంపూరుకు చెందిన టీడీపీ నాయకుడు కొమ్మి శ్రీధర్‌నాయుడు తన సొంత నిధులు వెచ్చించి ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో శ్మశాన వాటికలో ముళ్ల చెట్ల తొలగింపు తదితర పనులు చేయించారు. ఇక్కడ చెట్లు, ముళ్లపొదలు నిండిపోవడంతో ఖర్మకాండలకు ప్రజలు ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన ఆయన ఈ పనులు చేయించారు. 91 సెంట్ల శ్మశాన వాటిక స్థలం ఆక్రమణలకు గురై ప్రస్తుతం 70 సెంట్లు మాత్రమే ఉందన్నారు. శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాను, నాయకులు ధన ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోవర్లు లేకుండా సర్వేచేస్తే చర్యలు

● తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య

మనుబోలు, మే 18 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సిబ్బంది రోవర్లు లేకుండా సర్వేకు వెళితే చర్యలు తప్పవని తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య హెచ్చరించారు. రీసర్వేపై రైతుల్లో అసంతృప్తి అన్న కథనం ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 5 రోవర్లు మాత్రమే ఉన్నాయన్నారు. పది బృందాలను రీసర్వే కోసం వేశామన్నారు. అయితే 5 బృందాలు ఉదయం, 5 బృందాలు సాయంత్రం రోవర్లతో వెళ్లి రీసర్వే చేయాలని సూచించామన్నారు. కచ్చితంగా రోవర్లు ఉంటేనే రీసర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఉదయం సర్వే చేసిన బృందం మధ్యాహ్నం నుంచి కంప్యూటర్‌లో ఆ వివరాలు నమోదు చేయాలన్నారు. అలాకాకుండా సర్వే బృందాలు రైతుల నుంచి కేవలం వివరాలు మాత్రమే సేకరించి, రోవర్లు తీసుకెళ్ళకపోతే రైతులు ప్రశ్నించాలన్నారు. రైతులు ఫిర్యాదు చేస్తే కచ్చితంగా సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీపొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

● ఘనంగా జయంతి వేడుకలు

బుచ్చిరెడ్డిపాళె, మే 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధనకు, దళితుల ఆలయ ప్రవేశం కోసం శ్రీపొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యుడు ఎంవీ. శేషయ్య అన్నారు. ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా తిరివీధి రాధాకృష్ణయ్య, సొల్లేటి ప్రభాకర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, కమిషనర్ డి.బాలకృష్ణ, వైస్ చైర్మన్ పీ.శివకుమార్‌రెడ్డిలతో కలసి బుచ్చిరెడ్డిపాళెం పట్టణం చెన్నూరురోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బత్తల హరికృష్ణ, హరనాథ్, పార్టీలకతీతంగా పలువురు నాయకులు తరలివెళ్లారు.



బుచ్చిలోని శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏడాదిలోపే హామీలను నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం

● జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి

వెంకటాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్నట్లు జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు. వెంకటాచలంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం జనసేన నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా అభివృద్ధి వైపు నడిపిస్తూ సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంతో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా నిలిచిందన్నారు. గత వైసీపీ పరిపాలన అవినీతికి చిరునామాగా నిలిచిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, శ్రీహరి, సుబ్రహ్మణ్యం, రహీమ్, అశోక్, మస్తాన్, చిన్న, రెహమాన్, తదితరులున్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం, మే 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమస్యలను సమష్టిగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని టీడీపీ బుచ్చి రూరల్ మండల అధ్యక్షుడు బెజవాడ జగదీష్ అన్నారు. ఆదివారం పెనుబల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేసుకుని స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కేవీ. శేషయ్య, శేషు, చిన్న చంద్రమోహన్, వివేక్, మహేంద్ర, మస్తాన్, సుమంత్ తదితరులున్నారు.

● టెన్త్, ఇంటర్‌తో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. బుచ్చిలోని ఉన్న భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మలవతు సుధాకర్, చేవూరు చలమయ్య, గండికోట సుధీర్‌కుమార్, పోలిశెట్టి నరసయ్య, శ్రీహరిమల్లికార్జున, సురేంద్రబాబు, పెంచల ప్రసాద్, వెంకటశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.


బాలుర టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ విజేత ‘విశాఖ’

● బాలికల విభాగంలో ‘తూర్పుగోదావరి’

కోవూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కోవూరు మండలం పాటూరు జడ్పీ హైస్కూల్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో బాలుర విభాగంలో విశాఖ పట్నం, బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్లు నిలిశాయి. అనంతరం జరిగిన అభినందన సభలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు కోసం క్రీడాకారులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాల న్నారు. టార్గెట్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించిన రాష్ట్ర జట్టుకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమతాటి వెంకటరమ ణయ్య, అసోసియేషన్ ప్రతినిధులు బట్టా పాల్‌విల్సన్, పులివెందుల మల్లికార్జున, ఎన్ వెంకటేష్, జనార్దన్‌రెడ్డి, విద్యాసాగర్, సజ్జా మల్లికార్జున, చిట్టిబాబు, కాలేషా పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన విశాఖ బాలుర జట్టు



విజేతగా నిలిచి కప్పు అందుకుంటున్న తూర్పు గోదావరి జిల్లా బాలికల జట్టు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	135
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	268

కోడిగుడ్ల ధర (100): 525

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8982
వెండి కిలో ధర	రూ. 98.200
వెండి ఒక గ్రాము	రూ.101.20

నేడు టీడీపీ మినీ మహానాడు

కందుకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆపార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు, బూత్‌లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి మినీమహానాడును జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

బెల్టు దుకాణంపై దాడి

● 10 మద్యం సీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

కావలి, మే 18(ఆంధ్రజ్యోతి) : కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు తాతా వెంకయ్యను అదుపులోకి తీసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పట్టపగలే ప్రింటింగ్ ప్రెస్‌లో చోరీకి యత్నం

లింగసముద్రం, మే 18 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లోకి ఓ యువకుడు పట్టపగలే దూరి చోరీకి యత్నించాడు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామానికి చెందిన కామేపల్లి మాలకొండయ్య తన ఎంకె ప్రింటింగ్ ప్రెస్‌కు వచ్చి తలుపులు తెరిచి, షాపు లోపలకు వెళ్లే చిన్న గేటుకు తాళం వేసి మళ్లీ ఇంటికి వెళ్లాడు. మాలకొండయ్య తిరిగి 10 గంటల సమయంలో ప్రింటింగ్ ప్రెస్‌కు వచ్చి చూడగా లోపల ఓ యువకుడు ఉన్నాడు. దీంతో ఆయన చుట్టుపక్కల వారిని పిలిచి విషయం చెప్పగా పలువురు ప్రెస్ వద్దకు వచ్చి ఆ యువకుడిని ప్రశ్నించగా, తన పేరు కానీ, ఊరు కానీ చెప్పడం లేదు. కానీ ప్రెస్ లోపల ఉన్న 4 ప్రింటర్లు, 2 సీపీలు, 2 మోనిటర్లు పగులగొట్టాడని బాధితుడు మాలకొండయ్య చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ పునఃప్రతిష్ఠ

● శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామిచే కుంభాభిషేకం





నవగ్రహ పూజలు చేస్తున్న శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి ఫొటో అందచేస్తున్న విధుశేఖర భారతీ స్వామి

కావలిటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ కుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆశీర్వచనాలతో మహాకుంభాభిషేకం, కలశ పోషణ, మహాదాశీర్వచనం తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి విధుశేఖర భారతీ స్వామి ఆశీర్వాదం అందుకున్నారు. ఉదయం గురుప్రార్థన, అవాహిత దేవతా పూజలు, ప్రాణ ప్రతిష్ఠ, ప్రతిష్ఠాంగ హోమం, నవగ్రహ పూజలు జరిగాయి. అనంతం స్వామి వారిచే కలశ ప్రోక్షణ, మహాదాశీర్వచనం, రుత్విక్ సన్మానంతో పూజలు పరిపూర్ణమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కందుకూరి సత్యం, గ్రంధి రమేష్, వోలేటి నాగేశ్వరరావు, పోతుగంటి అలేఖ్య, అమరా వేదగిరి, యేల్చూరి రవి, చీదెళ్ల రామచంద్రరావు, కనమర్లపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు







ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న గంగవరపు సుధాకర్, బాలయ్య, కోసూరి సుధీర్

కావలి రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మాగుంట పార్వతమ్మ ట్రంక్‌రోడ్డులోని పుల్లారెడ్డి నగర్ వద్ద, మండలంలోని వెంగయ్యగారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. మండలంలోని తాళ్లపాలెంకు చెందిన కోసూరి సుధీర్ వెంగయ్యగారిపాలెంలోని అత్తగారి ఇంటికి వచ్చి అక్కడ నుంచి మోటారు బైక్‌పై మద్దూరుపాడు వైపు జాతీయ రహదారిపై వెళుతుండగా పట్టణంలోని గాయత్రీనగర్‌కు చెందిన గంగవరపు సుధాకర్ తన స్నేహితుడు చీకుర్తి బాలయ్యతో కలిసి మోటారు బైక్‌పై తాటికాయల కోసం జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెంగయ్యగారిపాలెం వైపు వెళుతూ ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటారు బైక్‌లు నడుపుతున్న సుధాకర్, సుధీర్‌లకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో పట్టణంలోని ఓ ప్రైవేటు, బాలయ్యను ఏరియా ఆసుపత్రులకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సుధాకర్‌ను నెల్లూరుకు తరలించారు. అలాగే ముసునూరుకు చెందిన చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, తన కుమారుడితో కలిసి పట్టణంలోని ఆలయానికి వెళ్లి తిరిగి మోటారుసైకిల్‌పై ముసునూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని ట్రంకురోడ్డు సమీపంలో ఆర్‌కె దాబా వద్దకు వచ్చేసరికి డివైడర్ వద్ద కారు రోడ్డు క్రాస్‌చేస్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. క్షత గాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాల కు తరలించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దచెరువులో ఆగని గ్రావెల్ తవ్వకాలు

● ఎమ్మెల్యే ఇంటూరి హెచ్చరించినా రాత్రుళ్లు యథేచ్ఛగా అక్రమ రవాణా



రాజుపాలెం పెద్ద చెరువులో గ్రావెల్ తవ్వకంతో ఏర్పడిన గుంతలు

ఉలవపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం పెద్ద చెరువులో గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతోన్నాయి. రాజుపాలెం గ్రామానికి చెందిన ఓ చోటా నాయకుడు, ఉలవపాడుకు చెందిన మరికొందరు శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. సమీప భీమవరం గ్రామం నుంచి 10 ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌లను తీసుకొచ్చి గ్రావెల్ తరలించినట్లు సమాచారం. గత నెల 27వ తేదీ అర్ధరాత్రి ఇలాగే గ్రావెల్ తరలిస్తుండగా స్థానికులు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సదరు వ్యక్తులను గ్రావెల్ తవ్వకాలు చేపట్టవద్దని హెచ్చరించారు. దీంతో కొంతకాలం ఆగినప్పటికీ గత గురువారం అర్ధరాత్రి నుంచి మళ్లీ గ్రావెల్ తోలకం చేపట్టారు. చెరువు ఆనకట్ట ధ్వంసం చేసి యథేచ్ఛగా అక్రమంగా గ్రావెల్ తోలుకుంటున్నా మాకెం పట్టిందన్నట్లు ఇరిగేషన్ అధికార్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత గ్రావెల్ తోలుతున్నారని సమాచారం అందిచేందుకు ఇరిగేషన్ ఏఈ, డీఈలకు రెండు మూడు సార్లు ఫోన్ చేసినా స్పందంచలేదని, తహసీల్దారు శ్రీనివాసులు స్పందించిగా ఆయనకు సమాచారం ఇవ్వగా సిబ్బందికి తెలియపరిచి చర్యలు తీసుకుంటామని చెప్పారని, అయినా తెల్లవారి జామున 4 గంటల వరకు గ్రావెల్ తోలకం జరిగిందని స్థానికులు తెలిపారు.

అడ్డదారులు తొక్కిన విద్యాసంస్థపై

ఉన్నతస్థాయిలో విచారణ

కందుకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలలో ఆధిపత్యం కోసం అడ్డదారులు తొక్కిన వ్యవహారంపై ఉన్నతస్థాయిలో విచారిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఓ ప్రైవేటు సంస్థ పరీక్షా కేంద్రంలో పోటీ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన విద్యార్థుల ప్రశ్నపత్రాలను ట్యాంపరింగ్ చేసినది వాస్తవమేనని అధికారులు ఓ నిర్ధారణకు వచ్చి పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం. విద్యార్థులు అవినాష్, సాయితేజశ్వినితోపాటు ఆ గదిలో పరీక్ష రాసిన ఇషహాక్ అనే మరో విద్యార్థి కూడా తన ఆన్సర్ సీటు కూడా ట్యాంపరింగ్ జరిగిందని ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. ఆ గది సీసీ ఫుటేజ్‌ను కూడా తీయించి పరిశీలించినట్లు విశ్వసనీయ సమాచారం. సీసీ ఫుటేజ్‌లో ఇన్విజిలేటర్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు ఆధారాలు సేకరించుకున్న బోర్డు సెక్రటరీ ఈ కేంద్రంలోని కంట్రైనర్ గదిని కూడా ఆదివారం వీడియో ఫుటేజ్ తెప్పించుకున్నట్లు తెలిసింది. ఒకటీ రెండు రోజుల్లో బాధ్యులందరిపై కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

నత్తనడకన ఆర్వోబీ.. ఫుట్‌పాత్ మరమ్మతులు

● రాకపోకలకు పాదచారుల ఇబ్బందులు



ఫుట్‌పాత్‌పై దెబ్బతిన్న బండలు, తొలగించిన బండలు

కావలి, మే 18(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ నడిబొడ్డున ఉదయగిరి రోడ్డులో నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఆర్వోబీ వంతెన మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతోన్నాయి. దీంతో పాదచారులు వంతెన రోడ్డుపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్వోబీ వంతెన మార్గం దెబ్బతిని ఉండటంతో ఇటీవల దానిపై ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సూచనల మేరకు ఒక లేయర్ తారు వేసి దానిని బాగుచేయించడంతో అందరూ హర్షించారు. అయితే వంతెనకు రెండు వైపులా ఉన్న ఫుట్‌పాత్‌పై గతంలో వేసిన మూత బండలు దెబ్బతిని ఉండటంతో వాటిపై రాకపోకలు కష్టంగా మారాయి. వాటిని తొలగించి దానిపై డస్ట్ వేసి సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డులా వేస్తున్నారు. కానీ ఆపనులు నత్తనడకన సాగుతుండటంతో రాకపోకలకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొలుత ఫుట్‌పాత్‌పై ఉన్న బండలను పైకి లేపి కొన్ని రోజులు వాటిని తొలగించకుండానే అలాగే వదిలేస్తున్నారు. ఆ తర్వాత బండలను తొలగించి కొన్ని రోజులు బాగు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో వంతెనపై రాకపోకలు సాగించే పాదచారులు ఫుట్‌పాత్ మరమ్మతుల పనులు కాకపోవటంతో రోడ్డుపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి వంతెనపై ఫుట్‌పాత్ మరమ్మతుల పనులు వేగవంతం చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయంలో చిన్నారులకు ఆటల పోటీలు

ఉలవపాడు, మే 18(ఆంధ్రజ్యోతి) : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో చిన్నారులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు శ్రద్ధాశక్తులతో గ్రంథాలయంకు వచ్చే విద్యార్థులకు ముందుగా నీతి కథలు చదివించి వారిలో నైతిక విలువలు పెంపొందేలా తమ వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సృజనాత్మక అంశాలకు సంబంధించిన చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. దాతల సాయంతో వారికి శీతల పానీయాలు, స్నాక్స్ అందజేశారు. ఈ పోటీలను ప్రభుత్వ ఉపాధ్యాయుడు భాస్కర్‌రాజా పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈసందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, బాణాసంచా నడుమ గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు వినాయక, నవగ్రహాలు, ధ్వజస్తంభం, కలశం ప్రతిష్ఠించారు. అర్చకులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు నూల వంశస్థులు అన్న ప్రసాద వితరణ చేపట్టగా దొడ్ల మౌలాలీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

అనంతసాగరం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరంలో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. ఈసందర్భంగా మహిళలు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నిర్వాహక కమిటీ అన్నదానం ఏర్పాటు చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యవారిపల్లి పంచాయతీ దేకూరుపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈసందర్భంగా మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పొంగళ్ల సామగ్రితో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణల అనంతరం ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయా కర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గానుగపెంటపల్లి గ్రామంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేక వేదికపై ఉంచి అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. కల్యాణం అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ముగిసిన సీతారాముల ఉత్సవాలు

మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. చివరిరోజు స్వామివార్ల వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగవరపమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సహకారంతో ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ చక్రబంధంలో ఉదయగిరి

● రోడ్లపైనే తోపుడుబండ్లు
● రోడ్ల విస్తరణ లేక ఇక్కట్లు
● తరచూ ట్రాఫిక్ కష్టాలు



రోడ్డు మార్జిన్‌లో తోపుడుబండ్లపై వ్యాపారం చేస్తున్న వర్తకులు



రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో స్తంభించిన ట్రాఫిక్

ఉదయగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన మార్గాల్లో తరచూ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతరత్రా వాహనాల్లో ప్రయాణించే వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీకావు. దశాబ్దాలుగా రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రజలు నిత్యం ఇక్కట్లకు గురవుతున్నారు. ఒకవైపు నుంచి బస్సు వస్తే రెండోవైపు బస్సు వెళ్లే పరిస్థితి లేదు. వాహనం నిలిచిన వెంటనే పదుల సంఖ్యలో ఇతరత్రా వాహనాలు వెనుక నిలబడిపోతున్నాయి.

దుకాణాలు వదిలేసి రోడ్లపై వ్యాపారాలు

పట్టణంలో కూరగాయలు, మాంసం మార్కెట్‌ను వదిలి వ్యాపారులు రోడ్ల మార్జిన్‌లలో వ్యాపారం చేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా గండిపాళెం మార్గం, మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కూరగాయలు, పండ్లు అమ్మే తోపుడుబండ్లు రోడ్డు మార్జిన్‌లో ఉంచి వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ద్విచక్ర వాహనదారులు అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో వాహనాలు ముందుకు కదిలే పరిస్థితి లేకుండాపోతోంది. ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు రోడ్డుపైనే నిలుపుతుండడంతో వాహన రాకపోకలకు మరీ ఇబ్బందికరంగా మారింది. పార్శిల్ వాహనాలను సైతం ప్రధాన మార్గాల్లో రోడ్డుపై ఉంచి వస్తువులను దిగుమతి చేస్తున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి.

రోడ్ల విస్తరణ లేక ట్రాఫిక్ కష్టాలు

పట్టణంలో పంచాయతీ బస్టాండ్ సెంటర్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గాల్లో రోడ్ల విస్తరణ లేక ట్రాఫిక్ కష్టాలు ఎదురువుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు తక్కువగా ఉండడం, వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. గతంలో రోడ్డు విస్తరణకు అధికారులు కొలతలు సైతం సేకరించారు. అనంతరం ప్రజాప్రతినిధుల వత్తిళ్ల కారణంగా వెనక్కి తగ్గారు. ఇప్పటికైనా అధికారులు పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయాలి



టీడీపీ నేతలతో మాట్లాడుతున్న మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు

సీతారామపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన వింజమూరులో సోమవారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గ స్థాయి టిడిపి మినీ మహానాడు కార్యక్రమం ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన జరుగుతుందని మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎస్వీ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మండల టిడిపి నాయకులు ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు రావాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి గురువు ఎన్‌వీ నారాయణరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉదయగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాల్లో ఉంటూ 30 ఏళ్ల తరువాత కలుసుకుని అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఎంఈవో-2 శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు కారకులైన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు అప్పటి ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీ నారాయణరావుతోపాటు ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు నాయబ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్ఎఫ్ఐ నాయకుడు కాకు వెంకటయ్య, పూర్వ విద్యార్థులు జనార్ధన్‌రెడ్డి, జయరామిరెడ్డి, సురేంద్ర, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీదేవి, సురేష్, రమణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 46.370 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 46.370 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

నెట్‌బాల్ పోటీల్లో ఆత్మకూరు విద్యార్థుల ప్రతిభ



మనోజస్వంత్, వెంకటవిఘ్నేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్రంలోని బిచోలిమ్, ఛత్రపతి శివాజీ మహరాజ్ మైదానంలో ఈనెల 12వ తేదీ నుంచి 15 వరకు జరిగిన జాతీయస్థాయి జూనియర్ రౌండ్ నెట్‌బాల్ పోటీల్లో ఆత్మకూరు మున్సిపాల్టీకి చెందిన విద్యార్థులు కందుకూరి మనోజస్వంత్, ఎస్ వెంకటవిఘ్నేష్ కాంస్య పతకం సాధించారు. దీంతో వారిని ఉపాధ్యాయులు, పురప్రజలు, పలు పార్టీల నాయకులు అభినందించారు.

ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు. కాగా, ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం తథ్యం



సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రన్‌ను సన్మానిస్తున్న వాకర్స్

బిట్రగుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో సాధన చేస్తే విద్య, క్రీడల్లో విజయం తథ్యం అని సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రన్ (మను) అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో జరుగుతున్న వేసవి తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శాలువలతో మహేంద్రన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బర్నాడ్, కుందుర్తి శ్రీనివాసులు, ఎన్ఎస్ యాదవ్, పి.స్వర్ణన్‌రాజ్, సత్యనారాయణచార్యులు, సలీమ్, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ



నారాయణగిరి గార్డెన్‌లోని క్యూలో భక్తులు





ఎంబీసీ వద్ద టైం స్లాట్ భక్తుల నిరీక్షణ - అన్నదానం వద్ద.. - గదుల కోసం సీఆర్వో వద్ద పడిగాపులు

తిరుమలలో ఆదివారమూ భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవుల నేపథ్యంలో శుక్రవారం తిరుమలలో రద్దీ పెరిగిన విషయం తెలిసిందే. యాత్రికుల క్యూలైన్లు వెలుపలకు రాకపోయినా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో మూడురోజులుగా నిండుతున్నాయి. ఆదివారం కూడా వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో షెడ్లు నిండి.. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 16 గంటల దర్శన సమయం పడుతోంది, టైంస్లాట్ భక్తులకూ దాదాపు మూడు గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతం, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, బస్టాండ్, లేపాక్షి, రాంభగీచ సర్కిల్, వరాహస్వామి విశ్రాంతి భవనాల వద్ద భక్తుల సందడి ఎక్కువగా ఉంది. గదుల కోసం సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి విచారణ కార్యాలయాల ముందు భక్తులు బారులు తీరారు. గదులు దొరకని వారు ఆయా కార్యాలయాల ముందు, క్యూలైన్ల వద్ద, వసతి సముదాయాలు, షెడ్లలోనే సేదతీరారు. కేటాయించిన సమయాని కంటే ముందుగానే రావడంతో స్లాటెడ్ సర్వదర్శన భక్తులతో ఎంబీసీ, ఎస్వీ గెస్టహౌస్ ఏరియాలోనూ రద్దీ ఉంటోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ముక్కంటి ఆలయంలోనూ..

శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సహా వేసవి సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 536 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,341, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,508 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,049మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,177, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 336, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 318, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 72మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,210 విక్రయించినట్టు అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

మూగబోయిన షార్

- గగన ప్రయాణంలో దారి తప్పిన పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్



ఆదివారం ఉదయం 5.59 గంటలు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నారింజ రంగు లేలేత పసిడి వర్ణాలతో పులికాట్ సరస్సు- బంగాళాఖాతానికి మధ్య పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నింగిలోకి ఎగిరింది.

6.07 గంటలు : రాకెట్ రెండు దశలు సునాయసనంగా పూర్తిచేసుకొని మూడో దశ ప్రారంభం కాగానే గమన వేగం తగ్గి దారితప్పింది. శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ. రాకెట్ ప్రయోగ లైవ్ కూడా కాసేపు నిలిపివేశారు. అందరిలో ఏం జరిగిందో తెలియని పరిస్థితి.

6.11 గంటలు : పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తింది. ప్రయోగం ఇంకా పూర్తికాలేదు. వివరాలన్నీ మళ్లీ వెల్లడిస్తామంటూ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ నారాయణన్ ప్రకటించారు. లైవ్ ఆగిపోయింది.

అంతే.. ఏం జరిగిందనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ. కాసేపటికే మూడో దశలో రాకెట్ వేగం తగ్గి తన గమనాన్ని వీడి దిశ మార్చుకుని విఫలం చెందడంతో శాస్త్రవేత్తలు నిరాశ చెందారు. ఒక్కసారిగా బాధతో కూడిన నిశ్శబ్దం ఆవరించింది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

షార్, శ్రీహరికోట సమీపంలోని సూళ్లూరుపేట, సమీప గ్రామాలన్నీ రాకెట్ ప్రయోగమని సందడిగా ఉన్నాయి. తెల్లవారు జామునుంచే అందరి కళ్లు షార్ వైపే. శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా 22 గంటల పాటు కొనసాగి.. ఆదివారం ఉదయం సరిగ్గా 5.59 గంటలకు నిర్దేశిత సమయానికే పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నింగిలోకి ఎగిరింది. వీక్షకులతో పాటు షార్ శాస్త్రవేత్తలు, భవనాల పైకెక్కి రాకెట్‌ను చూస్తున్న వారంతా చప్పట్లు కేరింతలు కొడుతూ ఆనందంగా చూశారు. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని చూస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, సహచర శాస్త్రవేత్తలు చూస్తుండగానే రాకెట్ రెండు దశలు సునాయసనంగా పూర్తిచేసుకొంది. మూడో దశ ప్రారంభమై గమనం వేగం తగ్గి దారితప్పింది. శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ. రాకెట్ ప్రయోగ లైవ్ కూడా కాసేపు నిలిపివేశారు. అందరిలో ఏం జరిగిందో తెలియని పరిస్థితి. సరిగ్గా 12 నిమిషాలకు ఇస్రో చైర్మన్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తిందని, ప్రయోగం ఇంకా పూర్తికాలేదని చెప్పారు. మరోవైపు లైవ్ ఆగింది. దీంతో అప్పటి వరకు సందడిగా ఉన్న మీడి యా సెంటర్‌తో పాటు షార్ ప్రాంతమంతా నిశ్శబ్ద వాతావరణంతో మూగపోయింది. ఈ రాకెట్ ద్వారా పంపిన నిఘా నేత్ర ఉపగ్రహం నింగిలోకి పోకుండా విఫలం చెందింది. ఇస్రో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహ ప్రయోగం విఫలమవడం అందరినీ నిరాశ పరిచింది.

శాస్త్రవేత్తల్లో తీవ్ర నిరాశ

ప్రయోగం విఫలమని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కలిసి మీడియా సెంటర్‌కు వచ్చి చెప్పారు. ఇప్పటి వరకు సాలిడ్ మోటారు మూడో దశలో చిన్నపాటి లోపం కూడా తలెత్తలేదు. భారీ ఉపగ్రహాలు, ఒకేసారి 103 ఉపగ్రహాలను కూడా పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు అలవోకగా అంతరిక్షంలోకి పంపి విజయకేతనం ఎగురవేశారు. అలాంటిది కీలకమైన దేశ రక్షణకు సంబంధించిన ఉపగ్రహ ప్రయోగంలో ఎందుకిలా జరిగిందని తలలుపట్టుకుంటున్నారు. జనవరిలో జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ద్వారా ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించారు. మూడు రోజుల తరువాత ఉపగ్రహం నుంచి సంకేతాలు అందలేదు. దీంతో ఆ ప్రయోగం పాక్షిక విజయంగానే మిగిలింది. ఇప్పుడు 101వ ప్రయోగం సాంకేతిక సమస్య తలెత్తి విఫలం చెందడంతో శాస్త్రవేత్తలు తీవ్ర నిరాశ చెందారు.




రాకెట్ గమనం తప్పడంతో ఉత్కంఠగా చూస్తున్న ఇస్రో చైర్మన్ నారాయణన్, షార్ డైరెక్టర్ రాజరాజన్ - మిషన్ కంట్రోల్ నుంచి రాకెట్‌ను చూస్తున్న రేంజ్ ఆపరేషన్ శాస్త్రవేత్తలు

ప్రయోగాన్ని తిలకించిన పార్లమెంటరీ కమిటీ

పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగాన్ని పార్లమెంటరీ స్థాయి కమిటీ సభ్యుల బృందం తిలకించింది. ఏడుగురితో కూడిన ఈ సభ్యుల బృందం శనివారం రాత్రి శ్రీహరికోటలోనే బసచేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. దేశ రక్షణకు సంబంధించిన ఉపగ్రహ ప్రయోగం కావడంతో వీరు ఆసక్తిగా తిలకించారు. ప్రయోగం విఫలమైందని తెలిసి.. వీరు శాస్త్రవేత్తల భుజం తట్టి అభినందిస్తూ లోపాన్ని సరిచేసి మరో ప్రయోగాన్ని విజయవంతం చేయాలని ప్రోత్సహించారు.

నేలపట్టును సంరక్షించుకోవాలి

- పక్షుల కేంద్రాన్ని సందర్శించిన పార్లమెంటరీ కమిటీ

దొరవారిసత్రం, మే 18 (ఆంధ్రజ్యోతి): 'నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం చాలా మంచి పర్యావరణ ప్రకృతి కేంద్రం. ఇటువంటి ప్రాంతాన్ని సంరక్షించుకోవాలి' అని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భువనేశ్వర్ కలిత (అస్సాం రాజ్యసభ సభ్యుడు) అన్నారు. దొరవారిసత్రం మండలం నేలపట్టులోని విదేశీ విహంగాల విడిది కేంద్రాన్ని ఆదివారం ఈ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజ్ అయిపోవడంతో పక్షులను చూడలేక పోయామన్నారు. ఉన్న కొద్దిపాటి పక్షులు దూరంగా చెట్లపై ఉండటంతో కనిపించలేదన్నారు. మళ్లీ తాను జనవరిలో వ్యక్తిగతంగా వచ్చి పక్షులను చూస్తానన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు వంటి అంశాలపై అధ్యయనం చేసే ఈ కమిటీ తన పర్యటనలో భాగంగా నేలపట్టుక వచ్చింది. ఉన్న కొద్దిపాటి పక్షులను బైనాక్యులర్ల ద్వారా వీ వీక్షించారు. ఈసీ కేంద్రంలోని పక్షుల జీవన శైలిపై ఫిలింషో తిలకించారు. వీరికి తిరుపతి సీసీఎఫ్ సెల్వం, సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక, ఆర్డీవో కిరణ్మయి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, పలువురు షార్ కేంద్రం అధికారులు తమ సిబ్బందితో ప్రొటోకాల్ ఏర్పాట్లు చేపట్టారు. కమిటీ సభ్యులు తేజస్విసూర్య (కర్ణాటక), ప్రద్యుత్ బోర్దోలోయ్ (అస్సాం), మహేష్ కశ్యప్ (ఛత్తీస్‌గఢ్), త్రివేంద్రసింగ్ రావత్ (ఉత్తరాఖండ్), జగదాంబిక పాల్ (ఉత్తరప్రదేశ్), అల్ఫ్రెడ్‌కంగం ఆర్థర్ (మణిపూర్) పాల్గొన్నారు.



నేలపట్టు ఈసీ కేంద్రంలోని పక్షుల చిత్రాలను చూస్తున్న కమిటీ సభ్యులు

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

- జిల్లాలో 11 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 22,415 మంది విద్యార్థులు
- 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ
- 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

తిరుపతి(విద్య), మే 18(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఈనెల 27వ తేదీ వరకు జరుగనున్నాయి. 19, 20 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు, 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకుగాను తిరుపతిలో 5, పుత్తూరులో 2, గూడూరులో 4 మొత్తం 11 కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు జరగనున్నాయి. 22,415 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

పరీక్ష కేంద్రాలివే..

తిరుపతి: చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీరామా ఇంజనీరింగ్ కళాశాల, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్.

పుత్తూరు: సిద్ధార్థ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీవెంకటేశ పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ.

గూడూరు: ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

తిరుపతి(విద్య), మే 18(ఆంధ్రజ్యోతి): దేశంలోని ఐఐటీల్లో బీటెక్, బీఎస్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఆదివారం జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తిరుపతి కోఆర్డినేటర్ దుర్గ వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. తిరుపతి జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్, తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్, తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగగా 99 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు దుర్గ చెప్పారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మే 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, డివిజనల్, మండల కేంద్రాల్లో ప్రతి సోమవారమూ జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు జిల్లా అధికారులు, డివిజన్, మండల కేంద్రాల్లో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

రెండో విడత గ్యాస్ సిలిండర్ డబ్బులు రాలేదా?

- వెంటనే ఆధార్‌తో బ్యాంకు అకౌంటు లింక్ చేసుకోండి



తిరుపతి(నేరవిభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): రెండో విడత గ్యాస్ సిలిండర్ డబ్బులు మీ అకౌంటులో పడలేదా? లేకుంటే మీ ఆధార్‌ను బ్యాంకు అకౌంటుతో లింక్ చేయలేదా? వెంటనే ఉచిత గ్యాస్ సిలిండర్‌కు అర్హులైన వినియోగదారులు తమ ఆధార్‌తో పాటు రేషన్ కార్డును సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్ద ఇచ్చి లింక్ చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 2.40 లక్షల మందికి సబ్సిడీ డబ్బులు పడనట్లు తెలిసింది. దీంతో వారు గ్యాస్ బుక్ చేసి సిలిండర్లు వచ్చి నెల రోజులు కావస్తున్నా నగదు జమ కాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులకు దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తుంది. ఇప్పటికే లబ్ధిదారుల అకౌంటులో మొదటి గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి డబ్బును జమ చేశారు. కొంతమంది తమకు రెండో విడత ఉచిత గ్యాస్ రాయితీ డబ్బులు రాలేదని ఫిర్యాదు చేస్తున్నారు. వీళ్లందరూ మొదటి విడతలో డబ్బులు త్వరగా అకౌంటులో పడ్డాయని కానీ రెండవ విడతలో మాత్రం ఇప్పటి వరకు రాలేదని తెలిపారు. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల రెండో విడత గ్యాస్ సిలిండర్ రాయితీకి సంబంధించి నిధులు విడుల చేయడంలో ఆలస్యం జరిగిందని త్వరలోనే ఆ డబ్బులు బ్యాంకు అకౌంటుకు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది ఈకేవైసీ పూర్తి చేసుకోకపోవడం వల్ల కూడా సబ్సిడీ డబ్బులు పడలేదని అధికారులు అంటున్నారు. దీంతో ఈ నెలాఖరుకు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని లేకుంటే ఉచిత బియ్యంతో పాటు గ్యాస్ సబ్సిడీ నిధులు అకౌంటులో పడవని అంటున్నారు. అన్నీ పూర్తయ్యాక వారం రోజుల వ్యవధిలోనే సబ్సిడీ నిధులు జమవుతాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు చెప్పారు. కాగా, పట్టణంలో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ ఇంటి స్థలం ఉన్నా, నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వాడుతున్నా ఉచిత గ్యాస్ సబ్సిడీకి అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి సారూ!
ప్రమాదాల నిలయంగా కోట క్రాస్‌రోడ్డు



కోట క్రాస్‌రోడ్డు

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని క్రాస్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. దుగరాజపట్నం, మల్లాం, వాకాడు, విద్యానగర్, నాయుడుపేట, గూడూరు మార్గాలన్నింటికీ కోట పట్టణంలోని క్రాస్‌రోడ్డు కూడలి కావడంతో వాహనాలు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా ఈ మార్గం గుండా సిలికా రవాణా చేసే భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయి. ఈ క్రమంలో ఎదురెదురుగా ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు మృతి చెందగా, ఎంతో మంది గాయపడ్డారు. క్రాస్‌రోడ్డులో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునని స్థానికులు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి కోట క్రాస్‌రోడ్డులో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో...
భార్యను రాయితో కొట్టిచంపిన భర్త



మృతి చెందిన వీనమ్మ

నాయుడుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను భర్త రాయితో కొట్టి చంపిన ఘటన మండలంలోని మడఫలం పిల్లికాలువ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గత కొంతకాలంగా మడఫలం గ్రామం పిల్లికాలువ సమీపంలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, వీనమ్మ దంపతులు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం సాయంత్రం పనులు ముగించుకున్నాక భార్య, భర్తలిద్దరూ కల్లు సేవించారు. పొద్దుపోయాక ఇంటికి వెళ్తుండగా ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు రాయితో భార్య వీనమ్మ ముఖంపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా రఫీ



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా 786 రఫీ నియమితులయ్యారు. పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్లో ఆదివారం టీడీపీ పట్టణ నాయకులతో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీని పట్టణాధ్యక్షుడిగా నెలవల ప్రకటించారు. సమావేశంలో టీడీపీ నాయకులు శోభన చౌదరి, మైలారి రాజశేఖర్, పసల గంగాప్రసాద్, పెసల కిషోర్ బాబు, దార్ల రాజేంద్ర, జీవీఆర్ నాయుడు, జూలపాటి మస్తాన్, కొట్లపూడి రాజేష్, కరీంబాయ్ చెంచయ్య, గుంటూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ మృతుల ఆత్మశాంతి కోసం ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నవజీవన్ సంస్థ సభ్యులు

నాయుడుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బారినపడి మృతి చెందిన వారికి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయుడుపేటకు చెందిన నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక బీఈడీ కళాశాల నుంచి డీఎం అండ్‌హెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ మేనేజర్ బాలాజీ, కవిత, మంజుల, శ్రావణి, నందిని, సాయిలక్ష్మి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), మే 18(ఆంధ్రజ్యోతి): మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి సమీపంలోని శెట్టిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి వివరాల మేరకు.. శెట్టిపల్లికి చెందిన కొరివి ఆదిలక్ష్మి(40) భర్త అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. కుటుంబ పోషణ కష్టమైంది. ఉన్న కొద్దిపాటి అప్పులు తీర్చేమార్గం కనిపించలేదు. రుణదాతల నుంచి ఒత్తిడి అధికమైంది. ఈ క్రమంలో మానసిక వేదనకు గురైన ఆదిలక్ష్మి కొన్ని రోజులుగా ముభావంగా ఉంటోంది. రెండురోజుల క్రితం ఇంట్లోనే రసాయన ద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు, పక్క ఇంటి వారు గమనించి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలు కుమార్తె మానస ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మ్యూజియం పనులు
వేగంగా సాగుతున్నాయ్: టీటీడీ

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని టీటీడీ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. టాటా ట్రస్టు, బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ వంటి సంస్థల సహకారంతో ఈ పనులు జరుగుతున్నాయని పేర్కొంది. 'మ్యూజియంలో 14 ఆధునిక గ్యాలరీల పనులు తుదిదశలో ఉన్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం నిపుణుల సహకారంతో 2,200కు పైగా అరుదైన పురాతన వస్తువుల సంరక్షణ పూర్తయింది. తిరుపతిలోని పురాతన దేవాలయ శిల్పకళా మ్యూజియంలోని ప్రదర్శనలను తిరుమల మ్యూజియంలో విలీనం జరిగింది. పాత భవనం చెదిరిపోవడంతో కళాకృతులు కాపాడటానికి ఇది అవసరమైంది. రంగులు, లైటింగ్, డిజిటల్ డిస్‌ప్లేలు వంటి మెరుగుదల పనులు వేగంగా జరుగుతున్నాయి. గత పది నెలల్లో మ్యూజియం పనులు వేగవంతం చేశాం. తిరుమల మ్యూజియంను దేశంలోనే గొప్పదిగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోంది. సంప్రదాయంతో పాటు ఆధునిక టెక్నాలజీ వాడటం ద్వారా భక్తులకు మ్యూజియంలో ఒక దివ్యానుభూతి కల్పించేలా పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భక్తులు, పర్యాటకులు శ్రీవారి వైభవాన్ని, ఆలయ కళా సంపదను ఆస్వాదించే అవకాశం పొందుతారు' అని ఆ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.

చర్చిని తొలగించాలని ఆందోళన

చంద్రగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల పరిధి తొండవాడ ఎన్టీఆర్ కాలనీలో అనుమతి లేని చర్చిని తొలగించాలని ఆదివారం హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, బీజేపీ, జనసేన హిందూ సంఘాల నేతలు ఎన్టీఆర్ కాలనీలో ధర్నా చేయడానికి వెళుతుండగా తొండవాడ జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చర్చి ఏర్పాటు చేశారని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కాబట్టే ఆందోళనకు సిద్ధమయ్యామని చెప్పడంతో సీఐ సుబ్బరామిరెడ్డి ఈ విషయాన్ని తహసీల్దార్ శివరామసుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో చర్చిని సీజ్ చేస్తామని చెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

గూడూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో లక్ష్య ఫౌండేషన్, డీఆర్‌డబ్ల్యూ కళాశాల సహకారంతో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేశారు. వివరాలకు 8639835953, 9700561225, 9988853335 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, లోకనాథం, గణేష్, సునీల్, చెన్నయ్య, ప్రిన్సిపాల్ హనుమంతరావు, రూరల్ సీఐ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీసిటీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. శ్రీసిటీలోని డైకిన్ కంపెనీలో పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఆ సంస్థ హెచ్‌ఆర్ రంజిత్ తెలిపారు.

అనుమానాస్పద మృతిపై విచారణ

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం పంచాయతీ కొండుగుండ అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయమై ఆదివారం పోలీసులు విచారణ ప్రారంభించారు. కొండుగుంట అటవీ ప్రాంతంలోని రావి చెట్టు కింద పూర్తిగా మాడిపోయినట్లు ఉన్న సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని మృతదేహాన్ని పశువుల కాపరులు శనివారం గుర్తించారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ పవన్‌కుమార్ విచారణ చేపట్టారు.





మినీమహానాడులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నరసింహయాదవ్ తదితరులు - హాజరైన పార్టీ శ్రేణులు

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

మినీ మహానాడులో ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్నా... రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టనంలోని సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఎన్టీఆర్ పేదల అభ్యున్నతి కోసమే తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. క్రమశిక్షణతో ముందుకు నడుస్తూ పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకువెళుతూ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని, సీఎం చంద్రబాబు తన అనుభవంతో సమర్థవంత పాలన అందిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ పేదల సంక్షేమానికి పాటు పడుతున్నారన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహానాడు తెలుగు ప్రజలకు పండుగలాంటిదన్నారు. కడపలో ఈనెల 27నుంచి 29వ తేదీ వరకు జరగనున్న మహానాడును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని, గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని, ఫ్లైఓవర్, పంబలేరు బ్రిడ్జిలను పూర్తి చేయాలని, స్వర్ణముఖి బ్యారేజీలకు రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని తీర్మానాలను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పాపారెడ్డి మనోజ్ కుమార్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిషోర్‌నాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, మట్టం శ్రావణి, పట్టాభిరామిరెడ్డి, జలీల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు భారత జాతి రుణపడి ఉంటుంది: విజయశ్రీ



ర్యాలీలో ఎమ్మెల్యే విజయశ్రీ, కూటమి నాయకులు

సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశకోసం అమరులైన జవాన్ల త్యాగాలు అమూల్యమని, వారికి భారత జాతి ఎప్పటికి రుణపడి ఉంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలో తిరంగా ర్యాలీ చేశారు. స్థానిక వినాయకుడి గుడి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి భారత్ మాతాకీ జై.. మురళీ నాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, నాపా మునిరాజా, బండారు ఆంజనేయులు, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ దక్షిణవైపునున్న ఆర్చి వద్ద జాతీయ రహదారిపై కారు ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన మధు (32) మృతి చెందాడు. చెంగాళమ్మ ఆలయానికి వచ్చి దర్శనం చేసుకొని తిరిగి వెళ్తున్న సమయంలో ఆర్చి వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసరాల అందజేత

గూడూరు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఆర్‌రెడ్డి ఆసరా కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్న తుమ్మూరు గ్రామస్తులు

నాయుడుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం చొప్పర ఉత్సవం, రాత్రి పార్వేట ఉత్సవం నిర్వహించారు.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు



దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు అందజేస్తున్న జేవీవీసభ్యులు

గూడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాకాటి రామమోహన్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, రామమోహన్, పురుషోత్తమరావు, అరుణ్‌కుమార్, శర్మ, రాధయ్య, అశోక్, సుమన్‌రెడ్డి, బాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో
గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఉద్యానవనంలో మృతదేహం

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్దనున్న ఉద్యానవనంలో సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి కదలికలు లేకుండా ఉన్నాడనే సమాచారంతో అంబులెన్స్, భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. పక్కనే పురుగుల మందు బాటిల్ కనిపించడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు.. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ మొదలుపెట్టారు.

ఆదిశంకర కళాశాలలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న ఎంపీ సుజిత్‌కుమార్

గూడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యుడు సుజిత్‌కుమార్ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకునే విద్యార్థులు భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు లక్ష్యాలను కష్టపడి సాధించుకోవడంతో పాటు నైతిక విలువలు, సమాజసేవ పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య, ధనుంజయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న టీడీపీ నేత రమేష్

సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం సూళ్లూరుపేటలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో తారక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు టీడీపీ ట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ సర్టిఫికెట్స్ అందజేశారు. అదే విధంగా మన్నారుపోలూరు అనాథాశ్రమంలో పిల్లలకు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు హరికృష్ణ, చంద్రశేఖర్ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మేడాసాయి, ఆలీ, గోపికృష్ణ, సుధాకర్, వినోద్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో భారీ వర్షం

వెంకటగిరి టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రం మబ్బులు కమ్ముకుని ఈదురు గాలుల కూడిన భారీ వర్షం పడింది. బొగ్గులమిట్టలో విద్యుత్ స్తంభంపై చెట్టు వాలిపోవడంతో దాదాపు మూడు గంటల పాటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కోటమ్మకు ప్రత్యేక పూజలు



కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. వేద పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యాలమ్మకు...



చిల్లకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆరోగ్య వరప్రసాదినికి రూ.20 లక్షల విరాళం

తిరుమల, మే18(ఆంధ్రజ్యోతి): టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి వైజాగ్ హిందూస్థాన్ అసోసియేట్స్‌కు చెందిన మస్తాన్‌రావు ఆదివారం రూ.20 లక్షలు విరాళం అందజేశారు.

పొర్లుకట్టను తవ్వితే చర్యలు



పొర్లకట్టను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

పెళ్లకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి పొర్లుకట్టను తవ్విన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగరాజు, జలవనరుల శాఖ ఏఈ ఆశా చేతన్ అన్నారు. మండలంలోని కప్పగుంటకండ్రిగ సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుకను తరలించేందుకు కొందరు పొర్లుకట్టను తొలిచి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై రైతులు, జీలపాటూరు పంచాయతీ సర్పంచు శివకుమార్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే పత్రికల్లో వార్త ప్రచురితం కావడంతో జలవనరులు, పోలీస్‌శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం ఎస్‌ఐ నాగరాజు, జలవనరుల శాఖ ఏఈ ఆశా చేతన్ స్వర్ణముఖి పొర్లుకట్టను పరిశీలించారు. ఇసుక తరలించేందుకు పొర్లుకట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించారు. విచారించి పొర్లుకట్టను ఎవరు తవ్వారో తెలుసుకున్నారు. 24 గంటల్లో పొర్లుకట్ట తవ్విన ప్రాంతాన్ని పూడ్చివేయాలని, లేని పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యర్థాలను తొలగించండి



నిరసన తెలుపుతున్న మహిళలు

వెంకటగిరి టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్టలోని జెండా మాను వద్ద పదిరోజుల క్రితం మంచినీటి పైపులైను మరమ్మతుల కోసం మున్సిపాలిటీ సిబ్బంది రోడ్డును తవ్వారు. పనులు పూర్తి చేశాక నామమాత్రంగా పూడ్చారు. రోడ్డుపై కాంక్రీట్ ముక్కలు, రాళ్ల తొలగించకుండా అలాగే వదిలేశారు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట వీధిలో తిరిగే స్థానికులూ ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వ్యర్థాలను తొలగించాలని పలుమార్లు మున్సిపాలిటీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడంలేదంటూ స్థానికులు ఆదివారం వీధిలో నిరసన తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థినికి నగదు బహుమతి



విద్యార్థినికి నగదు అందజేస్తున్న టీడీపీ నేత చిన్నయ్య తదితరులు

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టేడులో గల నందమూరి భసవతారకం గిరిజన కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని హాసినికి టీడీపీ నేత చిన్నయ్య ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందజేశారు. కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న హాసిని 431మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఆదివారం టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు యాకసిరి చిన్నయ్య, మాజీ సర్పంచు ఈగ రఘురామయ్య రూ.5వేల నగదు అందజేశారు. అదేవిధంగా గిరిజన కాలనీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.50వేలు ఇస్తానని యాకసిరి చిన్నయ్య ప్రకటించడంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

తిరుపతి(నేరవిభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి, దేశ అభివృద్ధికి సహకరించాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ అంబె కోరారు. జులై ఒకటిన ఎనిమిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి జీఎస్టీ కార్యాలయ ఆధ్వర్యంలో సైకిల్ మరథాన్, వాకథాన్ నిర్వహించారు. పచ్చజెండా ఊపి ప్రారంభించిన అంబె మాట్లాడుతూ ప్రజలు, పన్ను చెల్లింపుదారులు, మేధావులు, వాణిజ్య, వర్తక సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించడానికి ఈర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. స్థానిక కేంద్ర కార్యాలయం నుంచి మహిళా వర్సిటీ, వైకుంఠపురం ఆర్చ్, ఎమ్మార్‌పల్లె సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఏజే ప్రసాద్, సహాయ కమిషనర్లు వినీ, ప్రేమ పాల్గొన్నారు.



జీఎస్టీ కార్యాలయం ఆధ్వర్యంలో సైకిల్ మారాథాన్ నిర్వహిస్తున్న దృశ్యం